

# నవభూమి

## జిల్లా అనుబంధం

12 ఆగస్టు,2025 మంగళవారం పేజీలు:7

www.epaper.navabhoomi.in


## సెలవులకు ఊరెళ్తున్నారా..

# జర భద్రం!

■ ఎస్పీ రోహిత్ రాజు




**కొత్తగూడెం ఆగస్టు 11 నవభూమి ప్రతినిధి:** వరుసగా సెలవులు రావడంతో చాలా మంది దూర ప్రయాణాలు చేస్తారు.ఇదే అదనుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారు. ఇంటిని వదిలి దూర ప్రయాణాలు చేసే వారు అప్రమత్తంగా ఉండాలని,ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. ఈ నెల 15,16,17 తారీఖులలో వరుస సెలవుల దృష్ట్యా చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టామని, జిల్లా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠా మన జిల్లా పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు పోలీసు వారికి సమాచారం అందిందని తెలిపారు. ఈ దొంగల ముఠా తాళం వేసి ఉన్న ఇండ్లలో దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. పోలీసు శాఖ తరపున రాత్రి వేళల్లో వీధుల్లో గస్తీని ముమ్మరం చేస్తున్నామన్నారు.ఈ విషయంలో జిల్లా పరిధిలోని ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు పలు సూచనలు చేశారు. దూర ప్రాంతాలకు వెళ్లేవారు తమ ఇంటి చిరునామా,ఫోన్ నెంబర్‌ను సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. దీంతో వారి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకుని ఊర్లెళ్లిన వారి ఇండ్ల పరిసర ప్రాంతాల్లో నిఘాను ఏర్పాటు చేస్తామని తెలిపారు. మీరు ఇంట్లో లేని సమయంలో మీ ఇంటిని గమనిస్తూ ఉండమని మీ ఇంటి దగ్గర గల మీకు నమ్మకమైన ఇరుగు పొరుగు వాళ్ళకు చెప్పడం మంచిదన్నారు. విలువైన వస్తువుల సమాచారాన్ని,వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదని సూచించారు. ఇంట్లో బంగారు నగలు,నగదు ఉంటే వాటిని బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం క్షేమం అన్నారు. ఎక్కువ రోజులు ఊళ్లకు వెళ్లేవారు విలువైన వస్తువులను తమ వెంట తీసుకెళ్లాలి. బ్యాగుల్లో బంగారు నగలు, డబ్బు పెట్టుకొని ప్రయాణం చేస్తున్నప్పుడు బ్యాగులు తమ దగ్గరే పెట్టుకోవాలని సూచించారు. ప్రజలు నిరంతరం పోలీసులతో సమన్వయంగా సహకరిస్తే చోరీలను నియంత్రించడం చాలా సులభమని తెలిపారు.

ఇండ్లలో, కాలనీల్లో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా సీసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మన జిల్లాలోని సింగరేణి, కేటీపీఎస్, నవభారత్, ఐ టి సి,బి టి పి ఎస్, ఇతర ప్రభుత్వ ప్రైవేటు కంపెనీల యాజమాన్యాలు తమ ఉద్యోగుల నివాస కాలనీలలో, గేటెడ్ కమ్యూనిటీలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని,పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసుకోవాలని సూచించారు. అనుమానాస్పద, కొత్త వ్యక్తుల కదలికలపై జిల్లా కమాండ్ కొంట్రోల్ నంబరు 8712682128 కు,డయల్ 100 సమాచారం అందించాలని కోరారు.

## కేంద్ర బ్యాంకును ప్రారంభించిన

# మంత్రి తుమ్మల



**మణుగూరు ఆగస్టు 11 నవభూమి ప్రతినిధి:** జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ని నూతన అద్దె భవనంలోకి మారుస్తున్న సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ముఖ్య అతిథులుగా హాజరై బ్రాంచ్ ని ప్రారంభించారు. డిసిసిబి బ్యాంకు ప్రారంభోత్సవానికి మణుగూరు విచ్చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఘన స్వాగతం పలికారు. ప్రారంభోత్సవ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం లక్ష కోట్లు రైతు సంక్షేమానికి అందించడం ద్వారా అనేక రూపాల్లో బ్యాంకులు సహకరించాయన్నారు. ఆర్థిక వెసులు బాట్లు లేకపోయినప్పటికీ రైతు సంక్షేమం కోసం అత్యధిక నిధులు వెచ్చించడానికి ప్రభుత్వం ముందుకు వస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అందరికీ అందుబాటులో ఉండే విధంగా సహకార బ్యాంకులో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రతి రైతుకి వ్యవసాయానికి కావాల్సిన ఆర్థిక భరోసాని కల్పించాలని బ్యాంకులకు సూచించారు. అటవీ అనుమతులు అడ్డుగా ఉన్నందున పులుసుబొంత ప్రాజెక్టు ప్రారంభానికి నోచుకోలేదని అన్నారు. మారెళ్ళ పాడు లిఫ్ట్ ఇరిగేషన్ శంకుస్థాపన అయిందని, పనులు పూర్తయితే 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ చందా లింగయ్య దొర, బ్యాంక్ సీఈవో వెంకటాదిత్య, ఏజీఎంఎస్ చంద్రావు, నవీన్ కుమార్, డిసిఓ శ్రీనివాస్ బ్యాంక్ మేనేజర్ బాలరాజు, సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, జిల్లా డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు



# యాప్ అవస్థలు

ఖమ్మం-నవభూమిబ్యూరో


కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలకు పోషకాహారం అందిస్తున్నాయి. పోషకాహార పంపిణీలో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం ముఖ ఆధారిత గుర్తింపు (ఫేషియల్ రికగ్నేషన్)ను అమల్లోకి తీసుకొచ్చింది. పోషణ్ ట్రాకర్ అనే యాప్‌లో లబ్ధిదారుల వివరాలను నమోదు చేసిన తర్వాతే పోషకాహార సరుకులను వారికి అందజేయాల్సి ఉంది. సర్వర్ సమస్య కారణంగా యాప్ తరచూ మొరాయిస్తోంది.

ఒక్కోసారి 2 నుంచి 3 గంటలపాటు పని చేయడం లేదు. ప్రధానంగా గ్రామీణ శివారు ప్రాంతాల్లో సర్వర్ అసలే పని చేయడం లేదు. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులను సిగ్నల్ ఉన్న ప్రాంతానికి తీసుకొచ్చి మరీ ఫేషియల్ రికగ్నేషన్‌ను నమోదు చేయాల్సి వస్తోంది. దీంతో కోసం అంగన్‌వాడీలు అష్టకష్టాలు పడుతున్నారు. లబ్ధిదారులు కూడా రోజుల తరబడి అంగన్‌వాడీ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. పోషకాహార లోపాన్ని అధిగమించేలా కిశోర బాలికలకు మిల్లెట్లుబీ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు బాలామృతం, కోడి గుడ్లు, అన్నం, పప్పు, పాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్నాయి.

**అటకెక్కుతున్న పూర్వ ప్రాథమిక విద్య..**

పోషకాహార పంపిణీలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యతో అంగన్‌వాడీ టీచర్లు ఎక్కువ సమయం వేచి చూసే ధోరణిలో ఉంటున్నారు. దీంతో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యను అందించేందుకు వారికి సమయం సరిపోవడం లేదు. ప్రతి నెలా రెండుసార్లు లబ్ధిదారులకు పోషకాహారం పంపిణీ చేయాల్సి ఉంటుంది. పోషణలోపం ఉన్న చిన్నారులకు కూడా అదనంగా పౌషకాహారాన్ని అందజేయాలి.

అయితే, పంపిణీ తీరు పర్యవేక్షణ కోసం, పంపిణీలో పారదర్శకత కోసం కేంద్ర ప్రభుత్వం ఏడాది క్రితం పోషణ్ ట్రాకర్ యాప్‌ను తీసుకొచ్చింది. ఒకవేళ ముఖ ఆధారిత గుర్తింపు నమోదు కాకపోయినా రిజిస్టర్‌లో సంతకం తీసుకుని సరుకులు పంపిణీ చేశారు. కానీ కేంద్ర ప్రభుత్వం జూలై నెల నుంచి ముఖ ఆధారిత




గుర్తింపు నమోదును తప్పనిసరి చేసింది. సర్వర్ సమస్య కారణంలో యాప్ మొరాయిస్తుండడంతో టీచర్లు పదేపదే ప్రయత్నిస్తున్నారు. అలాగే, సరుకుల కోసం లబ్ధిదారులు కూడా గంటల కొద్దీ అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. ఈ యాప్‌తోనే టీచర్లు ఆపసోపాలు పడుతుండడంతో ఎక్కువ సమయం వృథా అవుతోంది. చదువు చెప్పేందుకు సరైన సమయం కేటాయించలేకపోవడంతో చిన్నారుల చదువులు అటకెక్కుతున్నాయి.

## మధిర కరువు ప్రాంతంగా మారడానికి ఆ పార్టీ నేతలే కారకులు: లింగాల కమల్ రాజు

**మధిర-నవభూమి:** కాంగ్రెస్ పాలనలోనే కరువొస్తుంటుందని ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు విమర్శించారు. ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ కంటే ముందు, ఆ తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం పరిపాలించినప్పుడు కూడా కరువు వచ్చిందని జ్ఞప్తికి తెచ్చారు. 'ఈ విషయం కాంగ్రెస్ నాయకులకు గుర్తుకు లేదా?' అంటూ విమర్శించారు. అలాగే, మధిర నియోజకవర్గం ఇప్పటివరకు కరువు ప్రాంతంగా ఉండడానికి కాంగ్రెస్ పాలకులే కారకులని స్పష్టం చేశారు. మధిరలోని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర మంత్రులు ఇటీవల వంగవీడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు శంకుస్థాపనకు వచ్చి చిలకపలుకులు పలికారని విమర్శించారు. దానిని మరో జాలిముడి ప్రాజెక్టుగా తయారు చేయొద్దని సూచించారు.

## కశ్మీర్ లోయలో ఆర్మీ జవాను దుర్మరణం..

# కారేపల్లిలో విషాదం

**కారేపల్లి-నవభూమి:** ఖమ్మం జిల్లా కారేపల్లిలో విషాదం నెలకొంది. కశ్మీర్ లోయలో జరిగిన ప్రమాదంలో కారేపల్లికి చెందిన ఆర్మీజవాను మృతిచెందారు. ఈ సంఘటనకు సంబంధించిన పూర్తి



వివరాలు ఇంకా అందలేదు. మృతుని బంధువులు వివరాల కోసం కశ్మీర్ ఆర్మీ అధికారులను సంప్రదిస్తున్నారు.

# గోపిశెట్టి వెంకటేశ్వర్లు పరామర్శించిన తుంబురి దయాకర్ రెడ్డి

**తల్లాడ, నవభూమి, ఆగస్టు 11:** తల్లాడ గ్రామంలో నివాస ఉంటున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపిశెట్టి వెంకటేశ్వర్లు కు గుండె బైపాస్ సర్జరీ చేయించుకున్న విషయం తెలిసి రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ కార్యాలయం ఇన్చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి సోమవారం గోపిశెట్టి పరామర్శించారు. ఆయన ఆరోగ్య యోగక్షేమాల గురించి అడిగి తెలుసుకున్నారు. అదే రేపు వర్ధని ధైర్యంగా ఉండాలని త్వరగా కోలుకుంటారని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు గొడుగులూరి లక్ష్మారెడ్డి, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ ఈ సూబు. యాకూబ్ పాషా తదితరులు ఉన్నారు.





# సిపిఐ నాయకులు అయోధ్యకు మంత్రి నివాళి



**మణుగూరు ఆగస్టు 11 నవభూమి ప్రతినిధి:** కొద్ది రోజులు క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించిన సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బొల్లోజు అయోధ్య వారి చిత్రపటానికి సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వారి ఇంటికి వెళ్ళి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ సంఘటన దురదృష్టకరమైనదని, సిపిఐ పార్టీకి అయోధ్య లేకపోవడం తీరనిలోటని విచారం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కుటుంబానికి అండగా ఉంటామని ఆయన భరోసా కల్పించారు

# ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

## - 65 కేసులు నమోదు

**ఖమ్మం క్రైం, నవభూమి, ఆగస్టు 11:** ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో డ్రంకన్ అండ్ డ్రైవ్ పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించి 65 మందిపై కేసులు నమోదు చేసినట్లు ట్రాఫిక్ సిఐ బెల్లం సత్యనారాయణ తెలిపారు. ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు పర్యవేక్షణలో శని, ఆదివారాల్లో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో 16 కార్లు, 10 ఆటోలు, 39 ద్విచక్ర వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా గత వారం రోజుల్లో 32 సైలెన్సర్ మార్చిన బైక్స్ సీజ్ చేయడం జరిగిందని తెలిపారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పకుండ హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, నెంబర్ ప్లేట్ లేకుండా, బుల్లెట్ బైక్స్ కి సైలెన్సర్ మార్చి అధిక శబ్దంతో నడపరాదని సూచించారు.

# బదిలీలు,పదోన్నతుల షెడ్యూల్‌ను వెంటనే విడుదల చేయాలి

- **టిఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్.నాగేశ్వరరావు**



**ఏన్కూర్, నవభూమి,ఆగస్టు 11:** గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు,పదోన్నతుల షెడ్యూల్ ను వెంటనే విడుదల చేయాలని టీఎస్ యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి డిఎస్.నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. ప్రభుత్వ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల మూలపోచారంలో యం పుల్లయ్య అధ్యక్షతన జరిగిన మండల కమిటీ సమావేశంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి డిఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 323 ఆశ్రమ పాఠశాలలు,136 ప్రీ మెట్రిక్ వసతి గృహాలు ఉన్నాయన్నారు ,లక్ష మందికి పైగా గిరిజన విద్యార్థులు ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్నారని,45 వేల మందికి పైగా విద్యార్థులు వసతి గృహాల్లో చదువుకుంటున్నారన్నారు.ఒకవైపు పాఠశాలలు ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్న ఆశ్రమ పాఠశాలల్లో హెచ్.యం లు, సబ్జెక్టు టీచర్లు లేక విద్యార్థులు నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గత నెల 29న టీఎస్ యుటిఎఫ్ సంఘం పక్షాన ప్రాతినిధ్యం చేసిన సందర్భంలో రెండు, మూడు రోజులలో ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూలు ఇస్తామని గిరిజన సంక్షేమ శాఖ అధికారులు హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు . మరోపక్క ప్రభుత్వ,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించి తొమ్మిది రోజులు గడుస్తున్నా,గిరిజన సంక్షేమ శాఖ ఉపాధ్యాయుల పదోన్నతుల షెడ్యూలు విడుదల చేయకపోవడం గిరిజన ఉపాధ్యాయుల పట్ల అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమన్నారు. గిరిజన విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా వారికి న్యాయం జరిగే విధంగా పదోన్నతుల షెడ్యూల్ ను వెంటనే విడుదల చేయాలని వారు కోరారు.అలాగే పాఠశాల విద్యాశాఖలో చేపట్టినట్లు ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కూడా భాషా పండితులు,పీఈటీల పోస్టులను అప్గ్రేడ్ చేసి, పదోన్నతులు కల్పించాలని, కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులను మంజూరు చేయాలని, ఆశ్రమ,ప్రాథమిక పాఠశాలలకు స్కూల్ గ్రాంట్స్ మంజూరు చేయాలని,సీఆర్టీల పెండింగ్ వేతనాలను వెంటనే మంజూరు చేయాలని, వారికి మినిమం టైం స్కేల్ ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఈ విషయంలో స్పందించని పక్షంలో సిటిడబ్ల్యూఓ కార్యాలయం ముందు ఆందోళన చేస్తామని తెలియజేశారు.కార్యక్రమంలో మండల నాయకులు బి.శోభన్,బి. రవి,బి.సింగ్యా,ఎం.చందర్ రావు, శ్యామల,సుస్మిత,వి.రమేష్, జె.నాగేశ్వరరావు,ఉషశ్రీ హరియా నాయక్,చందర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు చదువుతో పాటు మంచి ఆరోగ్యం కూడా ముఖ్యం

- **జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**
- **నులిపురుగుల నివారణ మాత్రల వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు రావు**
- **కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**పాల్వంచ ఆగస్టు 11 నవభూమి ప్రతినిధి:** విద్యార్థుల విద్యా ప్రగతికి శారీరక, మానసిక ఆరోగ్యం కీలకమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. అంతర్జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణ పరిధి లోని బొల్లొరిగూడెం మైనారిటీ పాఠశాలలో నిర్వహించిన జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావుతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటేనే చదువులో పూర్తి స్థాయి దృష్టి పెట్టగలరని, అందుకే నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం ప్రాధాన్యత వహిస్తోందని తెలిపారు. నులిపురుగులు శరీరంలో ఉండటం వలన పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత, ఆకలి తగ్గడం, అలసట, కడుపు నొప్పి, వికారం, విరోచనాలు, బరువు తగ్గడం వంటి అనారోగ్య సమస్యలు ఎదురవుతాయని, ఇవి వారి శారీరక ఎదుగుదల, చదువులో ఏకాగ్రత, మానసిక అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతాయని వివరించారు. ఈ సమస్యలను నివారించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంను ప్రతి సంవత్సరం విజయవంతంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు. ఆల్బెండజోల్ మాత్రలు నులిపురుగులను పూర్తిగా నిర్మూలించడంలో, రోగ నిరోధక శక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. జిల్లా వ్యాప్తంగా 1 నుండి 19 సంవత్సరాల వయస్సు గల 3,36,136 మంది పిల్లలు మరియు యువతకు ఈ మాత్రలు అందించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి వైద్య ఆరోగ్య శాఖతో పాటు అన్ని సంబంధిత ప్రభుత్వ శాఖలు, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ప్రతి పాఠశాల, వసతి గృహం, అంగన్వాడీ కేంద్రం, కళాశాలలో ఈ మాత్రలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు మాట్లాడుతూ నులిపురుగుల నివారణ మాత్రల వలన ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాకపోవడంతో పాటు, ఎలాంటి అపోహలు పెట్టుకోకూడదని ప్రజలకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. మధ్యాహ్న భోజనం అనంతరం మాత్రలు ఇవ్వాలని, 1%-%2 సంవత్సరాల వయసు పిల్లలకు సగం మాత్ర, 2%-%19 సంవత్సరాల వారికి పూర్తి మాత్ర నమిలి మింగేలా చేయాలని సూచించారు. ఆగస్టు 18 వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా 19 ఏళ్ల లోపు ప్రతి ఒక్కరికి మాత్రలు అందించడానికి సంబంధిత శాఖలు సమన్వయంతో కృషి చేయాలని ఎమ్మెల్యే కోరారు. నులిపురుగులు పిల్లల ఆరోగ్యాన్ని దెబ్బతీసే ప్రధాన కారణమని, వాటి నివారణ ద్వారా పిల్లలు ఆరోగ్యవంతంగా, చదువులో ప్రతిభ కనబరుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జయలక్ష్మి, సిపిఓ సంజీవరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, బోధక సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# మండల వ్యాప్తంగా జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

**ఎర్రుపాలెం,నవభూమి,ఆగస్టు11:** జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం మండల కేంద్రం లోని గురుకుల పాఠశాలలో ఎంపిడిఓ సురేందర్,వైద్యాధికారి డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ కార్య క్రమం నిర్వహించారు.వైద్యాధికారి ప్రశాంత్ మాట్లాడుతూ మండలవ్యాప్తంగా ఉన్న అన్నిఅంగన్వాడీ,ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాలలు,కళాశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలు అందించినట్లు తెలిపారు.అనివార్య కారణాలవల్ల సోమ వారం మాత్రలుతీసుకొని వారికి మరల18 వ తేదీన వేయడం జరుగుతుందని వివ రించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ పద్మశ్రీ,హెల్త్ అసిస్టెంట్ వెంకటేశ్వర్రెడ్డి, ఏఎన్ఎం లు స్నేహ,వసంత,ఆశాకార్య కర్తలు విజయ,హేమలత,పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



# సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టండి



**గార్ల, నవభూమి, ఆగస్టు 11:** ఈ వర్షా కాలం సీజన్ లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టడం తో పాటు ప్రజలకు వైద్య, ఆరోగ్య సిబ్బంది అందుబాటులో ఉండాలని మహబూబాబాద్ జిల్లా ఇన్చార్జి కలెక్టర్ లెనిన్ వత్సల్ టోప్పో వైద్యులు, ఆరోగ్య సిబ్బందిని ఆదేశించారు. గార్ల మండలం ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిసరాలతో పాటు రికార్డులను పరిశీలించడం తో పాటు కేంద్రానికి వచ్చే రోగుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా అందుతున్న సహకారాన్ని ప్రజలకు అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఫైలేరియా వ్యాధి మందులను ప్రతి ఒక్కరికి అందించాలని, దీనిపై గ్రామాల్లో ముమ్మరం ప్రచారం చేపట్టాలని సూచించారు. వైద్యులు, సిబ్బంది స్థానికంగా ఉంటూ రోగులకు సేవలు అందించాలని, నిర్లక్ష్యం చేస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, గార్ల తహశీల్దార్ శారద, ఎంపిడిఓ మంగమ్మ, ముల్కనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి రాజ్ కుమార్ జాదవ్, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాల్వంచ శేఖరం బంజర్‌లో ఘనంగా తీజ్ వేడుకలు

**ఎమ్మెల్యే కూనంనేనితో కలిసి పాల్గొన్న రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల**





**పాల్వంచ ఆగస్టు 11 నవభూమి ప్రతినిధి:** పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని శేఖరంబంజర్ లో ఆదివారం రాత్రి తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల పాటు మహిళలు వేరు వేరు అంశాలతో పూజలు చేశారు. చివరి రోజున భక్తి శ్రద్దలతో తీజ్ వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావుతో పాటు రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్, డీసీఎంస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అతిథిగా పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బంజారాలు ఎంతో భక్తి శ్రద్దలతో తొమ్మిది రోజులు జరుపుకునే వేడుక తీజ్ అని అన్నారు. ఎంతో ఆనందోత్సాహాలతో మహిళలు సాంప్రదాయ నృత్యాలు చేస్తూ ఆనందంగా వేడుకలు జరుపుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు బాలూ నాయక్, స్వరాజ్ నాయక్, కాంగ్రెస్ నాయకులు ఎస్. ఏ జలీల్, వై.వెంకటేశ్వరరావు, శనగా రాంచందర్, సిపిఐ అడుసుమల్లి సాయి బాబు, చెరుకూరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# హార్జ్య తండాలో ఘనంగా తీజ్ పండుగ వేడుకలు





**లక్ష్మీదేవిపల్లి (కొత్తగూడెం) ఆగస్టు 11 నవభూమి:** లక్ష్మీదేవిపల్లి మండలం సీతారాంపురం, హార్జ్య తండాలో సోమవారం తీజ్ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోధుమలను నానబెట్టి తొమ్మిది రోజులు బుట్టలో సహజ సిద్ధ స్వచ్ఛమైన పశువుల ఎరువుతో నింపిన బుట్టలలో గోధుమ నారును వేసి పవిత్రంగా వాగు నీళ్లను తీసుకువచ్చి ప్రతి రోజు రెండు పూటలా పెళ్ళికాని అమ్మాయిలు నీళ్లను పోసి తొమ్మిది రోజులపాటు లంబాడీల సంప్రదాయ బద్ధంగా పూజలు లయ బద్ధంగా నృత్యం చేస్తూ ఎంతో ప్రేమతో ప్రకృతిని ఆరాధిస్తూ తీజ్ వేడుకలను నిర్వహిస్తారు. 9వ రోజు అనగా ఈరోజు తీసిన పందిరి పైనుంచి దింపి సేవాలాల్ మహారాజ్ కి మేరమ యాడిలకు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మాయిలు వారి అన్నదమ్ములు పెద్దల తలపాగలలో తీజ్ ను ఉంచారు. అనంతరం జీజ్ బుట్టలు తెచ్చిన సోదరీల కాళ్ళను కడిగి సోదరుడు ఆశీర్వాదం తీసుకుంటారు. అనంతరం డప్పు వాయిద్యాల నడుమ అంగరంగ వైభవంగా లంబాడీల సంప్రదాయ నృత్యాలు చేసుకుంటూ దగ్గరలోని వాగులో నిమజ్జనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖ ఈ ఎన్ టి సర్జన్ డాక్టర్ బి.ఎస్.రావు, న్యాయవాది ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, జిల్లా వర్కింగ్ మోహన్ నాయక్, గుగులోతు మోతిలాల్ నాయక్, హుస్సేన్, భద్రు రాములు, మాజీ సర్పంచ్ విజయ్ నాయక్, బిబు బాయి శుషాలీ, జమున మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

# రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న మోడీ



**గుండాల ఆగస్టు 11 నవభూమి:** అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒత్తిడికి కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని ఎస్ కె ఎం పిలుపుమేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గుండాల మాజీ సర్పంచ్ కోరం సీతారాములు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించి అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను ఆనందిస్తూ నల్ల చట్టాలను రద్దు చేసినట్టు నటిస్తూ వెనక నుండి పెనుబారాన్ని మోపే విధంగా కుట్రలు చేస్తున్నారని అన్నారు. ట్రంప్ వేస్తున్న మద్దతిస్తూ ఆ పన్నుల ద్వారా రైతులకు శనివారం పడుతున్న మోడీ ప్రభుత్వం మాత్రం ఏ మాత్రం పట్టించుకోవడంలేదని అన్నారు. రైతాంగ వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నందుకు ఈనెల 13వ తారీఖున జిల్లా కమిటీల పిలుపుల మేరకు. ప్రతి మండల కేంద్రంలో అఖిలపక్షం ఆ పార్టీల అనుబంధం సంఘాల కార్యకర్తలతో నిరసన కార్యక్రమాన్ని చేస్తున్నామని అన్నారు. అఖిలపక్ష నాయకులు ఈ నిరసన కార్యక్రమంలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. రైతు పక్షాన జరిగే ఈ కార్యక్రమానికి రైతాంగం తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి నరేష్, మాస్ లైన్ మండల కార్యదర్శి కొమరం శాంతయ్య, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తెల్లం భాస్కర్, సిపిఐ సహాయ కార్యదర్శి గడ్డం శ్రీను, న్యూడెమోక్రసీ నాయకులు వై వెంకన్న, మానాల ఉపేందర్, ఈసం కృష్ణ, బిఆర్ఎస్ పార్టీ నాయకులు గడ్డం వీరన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు వాంకుడోత్ రమేష్, మాస్ లైన్ నాయకులు తెల్లం రాజు, పునెం ఎం నరసయ్య, తదితరులు పాల్గొన్నారు

# డ్రగ్స్ గంజాయి మత్తు పదార్థాలను అరికట్టాలి

- మత్తు పదార్థాల విక్రయాలను నియంత్రించి యువత భవిష్యత్తును కాపాడాలి
- డ్రగ్స్ గంజాయి నిర్మూలనకై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి
- పివైఎల్ జిల్లా కార్యదర్శి కోర్సా రామకృష్ణ






**ములకలపల్లి ఆగస్టు 11 నవభూమి:** డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలను నియంత్రించి యువత భవిష్యత్తును కాపాడాలి అని ప్రగతి శీల యువజన సంఘం పీ వై ఎల్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కోర్సా రామకృష్ణ అన్నారు. ములకలపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన బైక్ ర్యాలీ లో పాల్గొని మాట్లాడారు. ఈ ర్యాలీ సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా పార్టీ కార్యాలయం నుండి పోలీస్ స్టేషన్ అనంతరం సాయిబాబా గుడి వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తూ ములకలపల్లి మండల ప్రధాన సెంటర్లో ఏర్పాటు చేసిన సభలో జిల్లా కార్యదర్శి కోర్సా రామకృష్ణ మాట్లాడుతూ యువత డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, యువత డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకై పోరాడాలని, ప్రభుత్వం మత్తు పదార్థాలను అరికట్టే చర్యలు తీసుకొని యువత భవిష్యత్తు ను కాపాడాలని గ్రామాలలో బెల్టు షాపులు నియంత్రించాలని ప్రభుత్వాన్ని కోరారు. యువతను ఉద్దేశించి మాట్లాడుతూ డ్రగ్స్ వద్దు ఆరోగ్యం ముద్దు, మాదకద్రవ్య నిర్మూలన మనందరి బాధ్యతని డ్రగ్స్ తీసుకుంటే తీసుకున్న వ్యక్తి కాదు తీసుకున్న కుటుంబం కూడా ప్రమాదంలో పడుతుందని, ప్రభుత్వాలు మాదకద్రవ్య నిర్మూలించాలని డ్రగ్స్ గంజాయి నిర్మూలనకై ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. డ్రగ్స్, గంజాయి మత్తు పదార్థాల నుండి యువత భవిష్యత్తును కాపాడుకునే బాధ్యత ప్రభుత్వానికి ఉందని గ్రామాలలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా తయారై మద్యం ఏరులై పారుతుందని బెల్ట్ షాపులు నివారించి యువతను కాపాడాలని, గ్రామాలలో యువత ఉపాధి అవకాశాలు లేక మద్యానికి బానిస అవుతున్నారని గ్రామములో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీ వై ఎల్ డివిజన్ అధ్యక్షులు పద్దం లక్ష్మణరావు, రైతు సంఘం డివిజన్ కార్యదర్శి నగరికంటి నాగేశ్వరరావు, పి వై ఎల్ డివిజన్ నాయకులు ఓరుగంటి శ్రీను, పి ఓ డబ్ల్యు జిల్లా నాయకురాలు నుపా సరోజిని, పి వై ఎల్ మండల నాయకులు సవల్ల శివ, సున్నం వీరస్వామి, కొండ్రు వెంకటేష్, కోర్సా వెంకటేష్, తానం రాజ్ కుమార్, సోడే బద్రి తదితరులు పాల్గొన్నారు

## ప్రియదర్శిని నయీమ్ పాషాకు బెస్ట్ ప్రిన్సిపాల్ అవార్డు

### ప్రధానం చేసిన ఐఏఎఫ్,జిఏఏఎఫ్ఎస్



**కొత్తగూడెం ఆగస్టు 1 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం లోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్కె నయీమ్ పాషా కు అమెరికా అప్రూవ్ చేసిన రెండు ప్రతిష్టాత్మక ఫోరమ్ లు ఐ ఏ ఎఫ్,(ఇంటర్నేషనల్ అక్రిడేషన్ ఫోరమ్) జి ఏ ఏ ఎఫ్ ఎస్(గ్లోబల్ అక్రిడేషన్ అసెస్మెంట్ ఫోరమ్ సిరీస్ ) సంస్థలు ఈ అవార్డు 2025 సంవత్సరానికి గాను ఉత్తమ ప్రిన్సిపాల్ గా ఎంపిక చేశాయి. ఈ అవార్డు ను సోమవారం రాష్ట్ర మైనార్టీ నాయకులు డాక్టర్ నయీమ్ ఖురేషి చేతుల మీదుగా అందుకున్నారు. ఖురేషి కార్యాలయం లో ప్రిన్సిపాల్ డాక్టర్ నయీమ్ పాషా కు శాలువ తో సన్మానించారు. ఈ కార్యక్రమం లో సయ్యద్ ఫైజుద్దీన్, జమీల్ అహ్మద్, ఏ ఐ టీ యు సి నాయకులు బాబు జానీ ఖాన్, తాజుద్దీన్, జునైద్ ఆలం, జర్నలిస్ట్ వహబ్ తదితరులు పాల్గొన్నారు.

## భారీవర్షాలకు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: ఎస్ఐ




**ఎర్రుపాలెం,నవభూమి,ఆగస్టు 11:** మండల ప్రజలుభారీవర్షాలు కురుస్తున్నందు వలన అప్రమత్తంగా ఉండాలని స్థానిక ఎస్సై రమేష్ కుమార్ సోమవారం తెలిపారు. ఈనెల13వ తారీకు నుండి వాతావరణ శాఖ సూచనల మేరకు మండలంలో భారీ వర్షాలు పడేసూచనలు ఉన్నాయని,వర్షం పడే సమయంలో ప్రజలు బయటకు రావద్దని,వాగులు ఉధృతంగా ప్రవహిస్తా యని,ఉరుములకు చెట్లు,విద్యుత్ స్తంభా లసమీపంలోఉండవద్దనిఅన్నారు.అత్యవసరమైతేనే బయటకు వెళ్లాలని,అనవస రంగావర్షానికిబయటకురావద్దనిఅన్నారు. విద్యుత్తు కూడా అంతరాయాలు ఏర్పడే పరిస్థితి ఉంటుందని,భారీ వర్షాల సమ యంలో ఇంట్లోనే ఉండాలని అన్నారు. ఏమైనా ప్రమాదాలుపొంచిఉన్నచో వెంట నే పోలీసు వారికి సమాచారం ఇస్తే అందు బాటులో ఉంటామని ఎస్సై రమేష్ కుమార్ తెలిపారు.

## రాహుల్ గాంధీ అరెస్ట్‌ను ఖండించిన కాంగ్రెస్ పార్టీ



**జూలురుపాడు, ఆగస్ట్ 11 (నవభూమి ప్రతినిధి) :-**ఓట్ల అవకతవకల వ్యవహారం పై పార్లమెంటు లో ప్రతిపక్ష నాయకుడు కాంగ్రెస్ పార్టీ పక్ష నేత రాహుల్ గాంధీ నేతృత్వంలో కేంద్ర ఎన్నికల కార్యాలయాన్ని ముట్టడించాలని ఇండియా కూటమి నేతల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని భగ్నం చేసి రాహుల్ గాంధీ,మల్లికార్జున ఖర్గే, ప్రియాంక గాంధీ తో పాటు ఇండియా కూటమి నేతల అరెస్టును ఖండిస్తూ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ చౌరస్తా లో రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి ప్రధాని మోదీ కి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.రాస్తారోకో తో ప్రధాన రహదారి పై పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోవడం తో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. ఈ కార్య క్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి,మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాళోత్ మంగి లాల్ నాయక్, దుద్దుకూరు మధు, వేల్పుల నరసింహారావు, రామిశెట్టి నాగేశ్వర రావు,రాంబాబు,లచ్చూ,కొలిపాక వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కొండలను కభళిస్తున్న మట్టి మాఫియా

- అనుమతులు లేని అక్రమ తోలకాలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- పాడైపోతున్న రహదారులు
- వందలాది వాహనాలతో గుల్ల అవుతున్న రహదారులు
- సమాచార హక్కు చట్టం ద్వారా తెలపాలనిసిపిఎం కార్యదర్శి దరఖాస్తు






**ఎర్రుపాలెం-నవభూమి:**ప్రకృతి సంపదను ధ్వంసం చేస్తూ మైనింగ్ అనుమతులు లేకుండా తమ ఇష్టానుసారంగా అక్రమంగా మట్టిని తరలిస్తూ లక్షల రూపా యలను మట్టి మాఫియా దోచుకుంటు ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నా రని,సంబంధిత శాఖఅధికారులు ముడు పుల ముసుగులో చూసి చూడనట్టు మట్టి మాఫియాకు సహకరిస్తు అధిక లోడుతో కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన రోడ్లు గుల్లచేస్తున్న అక్రమ గ్రావెల్ ముఠాల ఆటలను అరికట్టే నాథుడే కరువైపోయా రని సిపిఎం మండల కార్యదర్శి మద్దాల ప్రభాకర్రావు విమర్శించారు.తహసిల్దార్ మన్నె ఉషా శారదకు గ్రావెల్ తోలకాలకు ఎవరికి ఎటువంటి అనుమతులు ఉన్నా యో కోరుతూ సమాచార హక్కు చట్టం ద్వారా పూర్తి సమాచారం వివరించాలని సోమవారం దరఖాస్తు ద్వారా కోరారు. సమాచార హక్కు చట్టం 2025 సెక్షన్ పరిధిలో 6 (1) 7(1) 6(3) 4(4) 2 జె (11) సెక్షన్ల ను అనుసరించి వాటి ప్రకారం పొందుపరిచిన ప్రతి విషయాన్ని ధ్రువీక రించాలని కోరారు.దరఖాస్తు ద్వారా కోరిన వివరాలు మండలంలో రెవిన్యూ పరిధిలో కొండలు,క్వారీలు,మట్టిగుట్టలు ఏ గ్రామపంచాయతీపరిధిలో ఎన్ని ఉన్నా యో సమాచారం తెలపాలన్నారు.వాటిని ఉపయోగించుకోవటానికి ఏ గుట్టలకు ఎవరు ఎంతపరిధిలో మైనింగ్ పరంగా అనుమతులు పొంది ఉన్నారో తెలపాలన్నారు.ప్రతిరోజు వందలాది వాహనాల ద్వారాఅక్రమ మట్టిరవాణాచేస్తు,వాహనాలకు ఆర్టీవో శాఖఇచ్చినపరిమితికి మించి ఓవర్ లోడ్ తో మట్టిని తరలిస్తున్నారని అన్నారు.వీటి ద్వారా ప్రభుత్వానికి, సంబంధిత గ్రామపంచాయతీలకి ఎంత ఆదాయం వచ్చిందో తెలపాలన్నారు. ఎవరికైనా లీజు పర్మిషన్ ఉన్నట్లయితే గనులు,భూగర్భ,పర్యావరణ శాఖల నిబంధనలకు లోబడి ఎన్ని క్యూబిక్ మీటర్లువిస్తీర్ణంకు అనుమతికలిగి ఉన్నా రో చెప్పాలన్నారు.ఎటువంటి అనుమతు లు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తు న్నవారిపై ఏఏ శాఖలు చట్టపరమైన చర్యలుతీసుకున్నారో,ఎన్ని పెనాల్టీ లు విధించి ప్రభుత్వానికి ఎంత ఆదాయం సమకూర్చారో సంబంధిత విషయాలన్ని టికీ పూర్తి సమాచారం తెలపాలని సమా చార హక్కు చట్టం ద్వారా కోరారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు సగుర్తి సంజీవరావు,నాగులవంచ వెంకట్రా మయ్య,దూదిగ బసవయ్య,తదితరులు పాల్గొన్నారు.

# నూతన జిపి కార్యాలయంతో పాలనాసేవలు సులభతరం

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
- అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి
- పెండింగులో ఉన్న పంచాయతీ భవనాల నిర్మాణం చేపట్టేందుకు కృషి చేస్తా
- బిక్కుతండా జిపి నూతన కార్యాలయ భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే







**పాల్వంచ ఆగష్టు 11 నవభూమి ప్రతినిది:** నూతనంగా నిర్మిస్తున్న పంచాయతీ కార్యాలయాలతో పాలన సేవలు సులభతరం అవుతాయని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. సోమవారం మండల పరిధిలోని బిక్కుతండా గ్రామాల్లో 20లక్షలతో నూతనంగా నిర్మించిన పంచాయతీ కార్యాలయ భవనంనీ ఎమ్మెల్యే అధికారులు, గ్రామ ప్రజలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామానికి మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా నిరంతరం శ్రమిస్తున్నామన్నారు. ఇజిఎస్, డిఎమ్ఎఫ్టి, ఎస్డిఎఫ్ తదితర నిధులతో కోట్లాది రూపాయల వ్యంతో రోడ్లు, డ్రైన్లు నిర్మించడం జరిగిందని, ప్రతిపాదనలు పంపిన అభివృద్ధి పనులను త్వరలో అనుమతులు లభిస్తాయని తెలిపారు. అభివృద్ధిలో ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుకున్నామని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం అందుబాటులో ఉంటానని ప్రజలకు హామీ ఇచ్చారు. నియోజకవర్గం వ్యాప్తంగా పెండింగులో ఉన్న పంచాయతి భవనాల నిర్మాణ పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల మౌలిక వసతుల కల్పనపై పంచాయతీరాజ్ శాఖ దృష్టిసారించాలినీ, అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ తహసిల్దార్ దారా ప్రసాద్, ఎంపీడీవో విజయ భాస్కర్ రెడ్డి, ఎలక్ట్రికల్ ఏడిఈ అబ్దుల్ రహీం, పంచాయతీరాజ్ డిఈ రామకృష్ణ, ఎంపీఓ, రూరల్ ఎస్ఐ సురేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు ఎర్రంశెట్టి ముత్తయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, ఉప్పుశెట్టి రాహుల్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొండ వెంకన్న, పట్టణ అధ్యక్షుడు నూకల రంగారావు, సీపీఐ నాయకులు శనగారపు శ్రీనివాస్ రావు, నరహరి నాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ మద్దుల వీర మోహన్ రావు, జకరయ్య, మాజీ సర్పంచ్ భూక్యా విజయ, వేములపల్లి రాజశేఖర్, పోలబోయిన వెంకటేశ్వర్లు, రెహమాన్, కరీం, లాల్ సింగ్, గురుమూర్తి, భూక్య దేవా, కాంగ్రెస్ నాయకులు బద్ది కిషోర్, కాపర్తి వెంకటాచారి, విజయ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నివారణ

## డీఎస్పీ అబ్దుల్. రెహమాన్



**రుద్రంపూర్ ఆగస్టు 11 నవభూమి ప్రతినిధి:** ఒక సీసీ కెమెరా వందమంది పోలీసులతో సమానమని, దాని దృష్టిలో ఉంచుకుని కాలనీల్లో గ్రూపులుగా ఏర్పడి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకుంటే దొంగతనాలు జరిగే అవకాశం ఉండదని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. సోమవారం కొత్తగూడెం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 4వ తేదీన రుద్రంపూర్ నాలా ఏరియాకు చెందిన సింగరేణి ఉద్యోగిని వాకపల్లి వెంకటరమణ ఇంట్లో జరిగిన చోరీని పోలీసులు చేధించినట్లు తెలిపారు. సోమవారం టూ టౌన్ పరిధిలోని 4 ఇంక్లైన్ ప్రభుత్వ ఐటీఐ వద్ద టు టౌన్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా లక్ష్మీదేవిపల్లి మండలం కారుకొండ రామవరం చెందిన నారసాని రమేశ్, కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని మేదర బస్తి గొల్లగూడెం చెందిన ఓర్సు కుమార్, ఇరువురు మోటార్ సైకిల్‌పై అనుమానాస్పదంగా వస్తున్నారు. వారిని అదుపులోకి తీసుకుని, సోదా చేయగా బంగారు వస్తువులు, నగదు కలిగి ఉండడంతో వారిని ప్రశ్నించడంతో ఈ నెల 4వ తేదీన రుద్రంపూర్ కు చెందిన రమణ ఇంటిలో దొంగతనం చేసినట్లు తెలిపారు. నిందితుల వద్ద నుండి 22 తులాల బంగారం, 268 గ్రాముల వెండి, రూ.2,78,000 నగదును రికవరీ చేసినట్లు డీఎస్పీ వెల్లడించారు..

# ఎంపీల అరెస్ట్‌ను ఖండించిన మండల కాంగ్రెస్ అధ్యక్షులు



**ఎర్రుపాలెం,నవభూమి,ఆగస్టు 11:** పార్లమెంటు భవనం నుండి ఈసీ కార్యాలయానికి బయలుదేరిన కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకులతో పాటు ఇండియా కూటమి ఎంపీల అక్రమ అరెస్టును మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి సోమవారం ఖండించారు.బీహార్లో అక్రమంగా ఓటర్లను చేర్పించిన దానిపై ఈసీ కార్యాలయానికి వెళుతున్న రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీ,మల్లికార్జున్ ఖర్గేతో పాటుగా ఇండియా కూటమిఎంపీలఅక్రమ అరెస్టు ను ప్రజాస్వామిక వాదులంతా ఖండించాలన్నారు.ఓట్ల అవకతవకలపై విపక్ష పార్టీ ల ఎంపీలు ఆందోళన చేపట్టారని ఆయన తెలిపారు.ఓట్ల చోరీపై రాహుల్ గాంధీ లోకసభ లో ప్రశ్నించినప్పటికి అధికార పార్టీ సభ్యులు సమాధానం చెప్పలేదని ఆయన విమర్శించారు.సోమవారం ఇండియా కూటమి ఎంపీలతో కలిసి రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీ,మల్లి కార్జున్ ఖర్గే ఈసీ కార్యాలయానికి వెళ్తుండగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వారిని అక్రమంగా అరెస్ట్ చేయించిందని మండిపడ్డారు.రాహుల్ గాంధీకి దేశప్రజలు అండగా ఉన్నారని, అక్రమ అరెస్ట్ లతో బీజేపీపతనం మొదల యిందని సుధాకర్ రెడ్డి అన్నారు.

# ప్రజావాణి సమస్యలు పరిష్కరించండి

■ కలెక్టర్ జితేష్ వి పాటిల్





**కొత్తగూడెం ఆగస్టు 11 నవభూమి ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సంబంధిత అధికారులను సోమవారం ప్రజావాణి లో ఆదేశించారు. గ్రీవెన్స్ లో కొన్ని ఫిర్యాదులు జూలూరుపాడు మండలం మాచినేని పేటలో లచ్చు అతని భార్య వికలాంగులైన తమకు జీవనాధారం లేక అనేక ఇబ్బందులకు గురి అవుతున్నామని, డిగ్రీ పూర్తి చేసిన తనకు జీవన ఉపాధి కొరకు ఏదైనా ఉద్యోగం కల్పించాలి అని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం జిల్లా ఉపాధి కల్పనాధికారికి ఎండార్స్ చేశారు. చుంచుపల్లి లో నివాసముంటున్న కాకాటి అనూష లైసెన్సు ల్యాండ్ సర్వేయర్ గా శిక్షణ పూర్తి చేసుకుని ఉన్నానని,చుంచుపల్లి మండలానికి చెందిన తనను అప్రెంటిటీ నిమిత్తం తాళ్లపల్లి మండలానికి కేటాయించారని, ఏడాది వయసున్న పాపతో ఆళ్లపల్లి వెళ్లి రావటానికి ఇబ్బందులకు గురి అవుతున్నానని కావున తనని చుంచుపల్లి మండలానికి దగ్గరగా కేటాయించాలని పరిశీలించి తగు చర్యలు నిమిత్తం భూమి కొలతల శాఖ అధికారులకు ఎండార్స్ చేశారు. ములకలపల్లి మండలం పూసుగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని ఒట్టు రామవరం గ్రామంలో నివాసముంటున్న కొంతమంది ప్రజలు అంగన్వాడి స్కూల్ కాలనీ మంచినీటి బోరు చెడిపోవడం మిషన్ భగీరథ నీళ్లు సరిగా రాకపోవడం వలన కాలనీ వాసులు చాలా ఇబ్బందులు పడుతున్నామని త్రాగునీటి కోసం 1/2 కిలోమీటర్ దూరం వెళ్లి తీసుకొస్తున్నామని కావున తమ సమస్యను త్వరితగతిన పరిష్కరించి త్రాగునీరుగా అందించాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం మిషన్ భగీరథ ఈ ఈ కి ఎండార్స్ చేశారు. మణుగూరు భగత్ సింగ్ నగర్ లో నివాసం కొండేటి రమాదేవి రైల్వే భూ సేకరణలో భాగంగా తమ ఇల్లు కోల్పోయామని, నిరుపేదలైన తాము అనేక ఇబ్బందులకు గురి అవుతున్నామని, రైల్వే ప్యాకేజీలో తమకు ఇల్లు మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం మణుగూరు తాసిల్దార్ కు ఎండార్స్ చేశారు. పినపాక మండలం ఎల్చ్ రెడ్డిపల్లి కి గ్రామంలో నివాసముతున్న పాయం కృష్ణ వికలాంగుడు అయిన తనకు నడవడానికి మరియు వ్యాపారం చేసుకోవడానికి అనేక ఇబ్బందులకు గురి అవుతున్నానని, తన కు మూడు చక్రాల వాహనం మంజూరు కొరకు మీ సేవలో దరఖాస్తు చేసుకున్నానని, కావున తనకు వాహనం మంజూరు చెయ్యగలరు అని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యలు నిమిత్తం మహిళా శిశు వయోవృద్ధుల, దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

■ కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కొత్తగూడెం ఆగస్టు 11 నవభూమి ప్రతినిధి:** కొత్తగూడెం ప్రగతి మైదానంలో జరగనున్న 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను దేశభక్తి, పండుగ వాతావరణంలో అట్టహాసంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఆదేశించారు. సోమవారం ఐడీఓసీలో జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులతో సన్నాహక సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రగతి మైదానంలో ప్రధాన వేదిక, సీటింగ్, అతిథుల వసతులు సక్రమంగా ఉండేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని, వర్షాకాలం దృష్ట్యా వాటర్ ప్రూఫ్ టెంట్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. వేడుక ప్రాంగణంలో 108 అంబులెన్స్, వైద్య బృందాలను సిద్ధంగా ఉంచి, అవసరమైన మందులు, ప్రథమ చికిత్స సదుపాయాలు అందుబాటులో ఉంచాలని ఆరోగ్య శాఖకు ఆదేశించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని, అలాగే వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధక, అటవీ, విద్య, వైద్యం, పంచాయతీరాజ్, ఆర్టీసీ తదితర శాఖల పనితీరును ప్రతిబింబించే స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ప్రోటోకాల్ ప్రకారం అధికార అతిథులకు ఆహ్వానాలు పంపించడంతో పాటు, జాతీయ పతాకం గౌరవానికి భంగం కలగకుండా అన్ని ఏర్పాట్లలో జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థుల ద్వారా దేశభక్తి గీతాలు, నృత్యాలు, నాటికలు నిర్వహించి జాతీయ భావన పెంపొందించాలని కలెక్టర్ సూచించారు. ప్రశంసా పత్రాల బహూకరణ కోసం శాఖల వారీగా ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగుల పేర్లను నిర్ణీత గడువు లోపు సమర్పించాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించి, స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు విజయవంతంగా సాగేందుకు కృషి చేయాలని, జిల్లా ప్రజల్లో జాతీయ భావన పెంపొందేలా వేడుకలు నిర్వహించాలన్నది కలెక్టర్ ఆదేశించారు. ఈ సన్నాహక సమావేశంలో అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన,కొత్తగూడెం ఆర్డీవో మధు,జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రైతు బీమా పథకానికి దరఖాస్తుల స్వీకరణ

**గుండాల ఆగస్టు 11 నవభూమి:** 5 జూన్ 2025 లోపు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు తప్పనిసరిగా రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి వెంకట రమణ కోరారు. సోమవారం గుండాల రైతు వేదిక ఆవరణలో రైతుల నుండి రైతు బీమా దరఖాస్తులను స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయస్సు (14-08-1966 నుండి 14-08-2007 మధ్య జన్మించినవారు) కలిగిన రైతులు ఈ పథకానికి అర్హులు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవడానికి రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డుతో కూడిన దరఖాస్తు ఫారాన్ని సమర్పించాలి. గుండాల మండలంలో కొత్తగా రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు జారీ అయ్యాయి. వీరిలో అర్హులైన రైతులందరూ వెంటనే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే పట్టాదారు పాస్ పుస్తకం ఉన్న రైతులు తిరిగి దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదు. రైతు బీమా ఎల్ఐసి ఐడి కలిగి ఉన్న రైతులు తమ వివరాల్లో



ఏమైనా సవరణలు చేసుకోవాలనుకుంటే, ఈ నెల 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాల కోసం రైతులు సంబంధిత వ్యవసాయ విస్తీర్ణ అధికారిని లేదా మండల వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలని వెంకట రమణ సూచించారు.

# బ్యాంకు లాకర్ గదిని ప్రారంభించిన జనగం కోటేశ్వరరావు

## డిసిసిబి మణుగూరు బ్రాంచ్‌ని ప్రారంభించిన మంత్రి తుమ్మల

**మణుగూరు ఆగస్టు 11 నవభూమి ప్రతినిధి:** జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ మణుగూరు బ్రాంచ్ ప్రారంభోత్సవంలో మంత్ర తుమ్మల నాగేశ్వరరావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జిల్లా కలెక్టర్ జితిష్ వి పాటిల్



ప్రారంభోత్సవం చేసినారు. బ్యాంక్ చెస్ట్ లాకర్ రూమ్ ను డిసిసిబి జిల్లా డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, ముఖ్య కార్య నిర్వహణ అధికారి వెంకటా ఆదిత్య, డైరెక్టర్లు నిర్మల పుల్లారావు, నూకల సైదులు, మణుగూరు సొసైటీ అధ్యక్షులు కె నాగేశ్వరరావు, ఏజీఎంలు చంద్రావు, కే నవీన్, మణుగూరు, అశ్వాపురం బ్రాంచ్ మేనేజర్లు బాలరాజు, వెంకట కృష్ణ, బ్యాంక్ ఉద్యోగస్తులు, రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు



# స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీకి పార్టీలు సహకరించాలి

## ■ కలెక్టర్ జితేష్ వి. పాటిల్

**కొత్తగూడెం ఆగస్టు 11 నవభూమి ప్రతినిధి:** స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీ తోపాటు అవసరమైన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు సహకారం అందించాలని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ జితేష్ వి పాటిల్ రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. సోమవారంలో అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్ తో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఎన్నికల అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలోనే కాకుండా అంతకు ముందుగా కూడా ఓటర్ల జాబితా సవరణలు, క్లైములు, అభ్యంతరాల పరిష్కారం మరియు అదనపు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, మార్పు వంటి అంశాలపై తగిన సలహాలు, సూచనలు తీసుకుని అందుకు అనుగుణంగా తగిన చర్యలు తీసుకోవాలని భారత ఎన్నికల సంఘం ఆదేశించిందన్నారు. ఆ మేరకు ప్రతినెలా గుర్తింపు పొందిన వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి వారి అభిప్రాయాలను తీసుకుని ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. రాజకీయ పార్టీ ప్రతినిధులు చురుగ్గా ఉండి వారి దృష్టికి వచ్చిన ఎన్నికల అంశాన్ని ఏమైనా ఉంటే వాటిని సమావేశంలో తెలియజేయాలన్నారు. ఓటర్ల జాబితాను ఎప్పటికప్పుడు సరిదిద్దడం వలన స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారవుతుందని అన్నారు. ప్రతి బిఎల్ఓ కు ఒక బూత్ స్థాయి ఏజెంట్ను తప్పనిసరిగా నియమించాలని, రాజకీయ పార్టీలు బూత్ లెవెల్ ఏజెంట్లను నిర్మించుకోవాలని కలెక్టర్ సూచించారు. సమయంలో హడావుడి చేయకుండా ముందుగానే పోలింగ్ కేంద్రాలు లో మౌలిక సదుపాయాలు కల్పన, కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటు వంటి వాటిపై లిఖితపూర్వకంగా తెలియజేయాలని తద్వారా వాటిని




పరిష్కరిస్తామన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతి యువకులు ఓటు హక్కు పొందవచ్చని, ఇందుకోసం ఇందుకోసం వారు ఆన్లైన్లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చని ఆ దిశగా రాజకీయ పార్టీలు అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ,ఎలక్షన్ సెల్ సూపర్డెంట్లు, ముజాహిద్, రంగ ప్రసాద్, భారతీయ జనతా పార్టీ జనతా పార్టీ నోముల రమేష్, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ లక్ష్మణ్ అగర్వాల్, కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా అన్నవరపు సత్యనారాయణ, కమ్యూనిస్టు పార్టీ ఇండియా శ్రీనివాస్, ఆమ్ ఆఫ్ ది పార్టీ రాంబాబు, భారతీయ రాష్ట్ర సమితి పార్టీ అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించాలి

## ■ అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి వరక అజిత్

**పాల్వంచ ఆగస్టు 11 నవభూమి ప్రతినిది:** స్థానిక చంద్రా రాజేశ్వరరావు భవన్ లో నిర్వహించిన అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షులు షాహిద్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి వరక అజిత్ మాట్లాడుతూ ఆగస్టు 12న 89 వసంతాలు పూర్తి చేసుకుని 90 వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండలంలో ఏఐఎస్ఎఫ్ పతాకాన్ని ఆవిష్కరించి, ఘనంగా వేడుకలు నిర్వహించాలని కోరారు. ఆగస్టు 12 1936 న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం లక్నో నగరంలోని బెనారస్ విశ్వవిద్యాలయంలో పోతీల్లాలోనే పిడికిలి బిగించి చదువుతూ పోరాడు చదువుకై పోరాడు అనే నినాదిస్తూ స్వతంత్ర పోరాటంలో పాల్గొన్న మొట్టమొదటి ఈ దేశ విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని అన్నారు. నాటి నుండి నేటి వరకు విద్యారంగా సమస్యలపై వాటి పరిష్కారాలకై సమరశీల పోరాటాలు నిర్వహిస్తూ ఎంతోమంది విద్యార్థి అమరవీరుల త్యాగాలతో ఎరుపెక్కిన ఏఐఎస్ఎఫ్ జెండాను విద్యార్థులందరూ అక్కునా చేర్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా షాహిద్,




గుండాల సుజన, గుగులోత్ వంశీ, వినయ, పవన్ సాయి, నాగేంద్ర బాబు, బత్తుల సాయి, రాజ్ కమల్, శ్రీకాంత్, మహేష్, రవి, వెంకటేష్, సునీల్, యోగి, ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో పట్టపగలే భారీ చోరీ

## - రూ.12 లక్షల విలువ చేసే ఆభరణాలు, నగదు మాయం

**ఖమ్మం క్రైమ్ నవభూమి ఆగస్టు 11 :** జిల్లా కేంద్రం ఖమ్మంలో పట్టపగలే భారీ చోరీ జరిగింది. ఎన్టీఆర్ బైపాస్ రోడ్ ను బొమ్మరిల్లు అపార్ట్ మెంట్ నాలుగో అంతస్తులో ప్రజానాట్య మండలికి చెందిన దేవేందర్ నివాసముంటునాడు. అతని భార్య ఇటీవల అమెరికాలో ఉంటున్న కుమారుడు వద్దకు వెళ్లగా ఒంటరిగా ఉంటున్నాడు. సోమవారం ఉదయం 12 గంటల సమయంలో అతను బయటికి వెళ్ళగా గుర్తుతెలియని ఇద్దరు యువకులు అపార్ట్మెంట్లోకి ప్రవేశించారు. సీసీ కెమెరాకి దొరక్కుండా మొహం కనిపించకుండా తాళం నాలుగో అంతస్తుకు చేరుకొని దేవేందర్ ఇంటి గ్రిల్స్ ఓపెన్ చేసి తాళం పగలగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువా పగలగొట్టి అందులో ఉన్న సుమారు పది లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలు, రెండు లక్షల రూపాయలు నగదు, కెమెరా దొంగిలించుకుని అక్కడి నుంచి జారుకున్నారు. ఇంటికి తిరిగి వచ్చిన దేవేందర్ గ్రిల్ పగలగొట్టి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానం వచ్చి లోనికి వెళ్లి చూడగా చోరీ జరిగినట్టు గుర్తించి టూ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సిఐ బాలకృష్ణ సిబ్బందితో ఘటాసాలకు చేరుకొని సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించగా ఇద్దరు యువకులు లోనికి వచ్చినట్లుగా వారే ఈ దొంగతనాలకు పాల్పడి ఉంటారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. క్లూస్ టీం సిబ్బంది చోరీ జరిగిన ఇంటికి చేరుకొని వేలిముద్రలు సేకరించారు. చోరీ జరిగిన సమయంలో ఆ అంతస్తులోని వారు అందరూ ఉద్యోగస్తులు కావడంతో వారి వారి విధులకు బయటకు వెళ్లడంతో చోరీ జరగడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తెలిసిన వారే ఈ పని చేసి ఉండవచ్చని కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాధితుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# నులి పురుగుల నివారణకు మందుల పంపిణీ

## ■ ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ రజితా పరమేశ్వర్‌రెడ్డి

**ఉప్పల్ -నవభూమి:**జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా 1-19పిల్లలకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఉప్పల్‌లో కార్పొరేటర్ మందుముల రజితాపరమేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు.సోమవారం ఉప్పల్‌లోని ఎంపిపిఎస్, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు మాత్రలను.రజితాపరమేశ్వర్‌రెడ్డి పంపిణీ చేశారు.జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పరాన్నజీవుల ఇన్ఫెక్షన్ రేటును తగ్గించవచ్చని ఈ సందర్భంగా రజితాపరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. పేగు పురుగుల నిర్మూలన చేయవచ్చన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని 1-19 సంవత్సరాల మధ్య ఉన్న పిల్లలకు పాఠశాలలు మరియు అంగన్‌వాడీ కేంద్రాలలో పంపిణీ చేస్తున్నట్టుగా చెప్పారు.ప్రతి బిడ్డను నులిపురుగుల రహితంగా తీర్చిదిద్దాలని కోరారు.ఈకార్యక్రమంలో ఏఎన్ ఎంలు వనమాల,పాఠశాల హెచ్ ఎం. హ్యారిసింగ్ రాథోడ్,ఈగ ఆంజనేయులు ముదిరాజ్, సల్ల ప్రభాకర్ రెడ్డి,తుమ్మల దేవి రెడ్డి,ప్రేమ్,దూద భాస్కర్, విజయ్ అన్వర్,మహంకాళి రాజు,విజయ్ కుమార్,బాకారం అరుణ్, రంగుల శేఖర్,తదితరులు పాల్గొన్నారు.ప్రతి బిడ్డను నులిపురుగుల రహితంగా తీర్చిదిద్దాలని కోరారు.ఈకార్యక్రమంలో ఏఎన్ ఎంలు వనమాల,పాఠశాల



హెచ్ ఎం. హ్యారిసింగ్ రాథోడ్,ఈగ ఆంజనేయులు ముదిరాజ్, సల్ల ప్రభాకర్ రెడ్డి,తుమ్మల దేవి రెడ్డి,ప్రేమ్,దూద భాస్కర్, విజయ్ అన్వర్,మహంకాళి రాజు,విజయ్ కుమార్,బాకారం అరుణ్, రంగుల శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

# ఆదివాసీ జీవోలకూ చట్టబద్ధత కల్పించాలి

**ఆదివాసీలకు స్వయం పాలన కల్పించాలి**

**భారీ ఎత్తున ఉద్యమానికి సిద్ధం అవుతున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్**

**ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పూనెం శ్రీనివాస్**



**గుండాల అగస్ట్ 11 నవభూమి:** ఆదివాసి సంక్షేమ పరిషత్ గుండాల మండల కమిటీ సమావేశం అధ్యక్షులు పెండేకట్ల మహేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ యొక్క సమావేశానికి ఆదివాసి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు పూనెం శ్రీనివాసు పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం లోని ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీల విద్య ఉద్యోగ నిరుద్యోగ వ్యవస్థను మెరుగుపరచడం కోసం జీవో ఎంఎస్ నెంబర్ 3 తో పాటు 31 జీవోలు అయినటువంటి అంగన్వాడి, మెడికల్, ఫారెస్ట్, ఆశ వర్కర్, డ్రైవర్, పోలీస్ కానిస్టేబుల్ ఆర్టికల్చర్ మొదలగు జీవో ల్ని కలుపుకొని ప్రత్యేక చట్టం తీసుకువచ్చి ఏజెన్సీ ప్రాంతంలోని నిరుద్యోగ ఆదివాసులకు 100 శాతం రిజర్వేషన్తో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. ఈ చిన్న ప్రాంతమైన ఏజెన్సీ ప్రాంతంలోని ఉద్యోగాలను గిరిజనేతరాల కు కల్పించడం వల్ల ఏజెన్సీ ప్రాంతంలోని చట్టాలు నిర్వీర్యం కావడమే కాకుండా ఆదివాసి సంస్కృతి సాంప్రదాయాలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఎక్కువగా ఉన్నదని వారు ఆవేదన చెందినారు. ఏజెన్సీ ప్రాంతంలోని జీవో ఎంఎస్ నెంబర్ 3నీ చట్టం చేయాలని ప్రతి గూడెం నుండి ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నట్టు ఈ సందర్భంగా వారు తెలిపినారు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో విజ్ఞప్తులు చేసినా కూడా ఈ జీవో ఎంఎస్ నెంబర్ 3ను చట్టం చేయడానికి ముందుకు రాకపోవడంతో ఉద్యమానికి శ్రీకారం చుట్టడానికి ఆదివాసి సంక్షేమ పరిషత్ పూనుకున్నదని వారన్నారు త్వరలోనే ఏజెన్సీ ప్రాంతంలోనే జీవో నెంబర్ 3 తో పాటు 30 జీవో లను కలిపి చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ కార్యచరణ ప్రకటిస్తున్నట్టు ఈ సందర్భంగా వారు తెలిపినారు. ఈ యొక్క కార్యక్రమంలో గుండాల మండల ఉపాధ్యక్షుడు ఈసం లిపిన్, మొక్కటి ప్రశాంత్, జాయింట్ సెక్రెటరీ తెల్లం కిరణ్, జనరల్ సెక్రెటరీ కల్తీ లక్ష్మణ్, ఈసం శివాజీ, అరెం శేఖర్, కొట్టెం అశోక్, గొగ్గల సందీప్, అరెం సందీప్, పెండకట్ల నాగరాజు (సోషల్ యాక్టివిస్ట్) తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అల్బెండోజోల్ బిళ్లలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

**జూలూరుపాడు,ఆగస్ట్ 11 (నవభూమి ప్రతినిధి):**–జాతీయ నులి పురుగుల నిర్మూలనా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైరా నియోజక వర్గ శాసన సభ్యులు మాళోత్ రాందాస్ పిల్లలకు అల్బెండోజోల్ బిళ్లలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని వారి ఆరోగ్య సంరక్షణ మనందరి బాధ్యత అని దేశానికి ఆరోగ్యకరమైన సమాజాన్ని అందిద్దామని పిలుపు నిచ్చారు. పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వటానికి మనమంతా కలిసి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జుంకీ లాల్, సి ఐ శ్రీ లక్ష్మీ, మండల వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు తప్పెట లక్ష్మీ నరసయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి,మంగిలాల్, వేల్పుల నరసింహారావు, దరావత్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో బ్యూరోక్రసీ పాత్ర కీలకం

- రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం చెక్కుల పంపిణీ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



**కొత్తగూడెం ఆగస్టు 11 నవభూమి ప్రతినిధి:** సివిల్స్ లో తెలంగాణ నుంచి అత్యధిక సంఖ్యలో అభ్యర్థులు ఎంపికవ్వాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం ఆయన ప్రజాభవన్ లో సింగరేణి ఆధ్వర్యంలో మెయిన్స్ కు ఎంపికైన 180 మందికి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మానవ వనరులు అతి ముఖ్యమైనవి అవి బలమైన పెట్టుబడులని, ఆ మానవ వనరులను సానబట్టి వజ్రాలుగా తయారు చేస్తే సమాజానికి పెద్ద ఎత్తున ఉపయోగపడతారని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఆలోచన చేసి సివిల్స్ కు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఎంతో కొంత సాయం చేస్తే వారు లక్ష్యం సాధించేందుకు ఉపయోగపడుతుందని ఈ కార్యక్రమం చేపట్టినట్టు డిప్యూటీ సీఎం తెలిపారు. సివిల్స్ సాధించేందుకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు అన్ని విధాలుగా సహకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అభ్యర్థులకు మనో ధైర్యం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వరుసగా రెండో సంవత్సరం ఈ కార్యక్రమం చేపట్టిందని డిప్యూటీ సీఎం తెలిపారు. మెయిన్స్ కు ఎంపికైన 180 మందికి ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున అందిస్తున్నాము. ఇంటర్వ్యూ కి ఎంపికైన వారికి కూడా లక్ష ఆర్థిక సాయం, ఢిల్లీలో వసతులు కల్పిస్తాం అని భరోసా ఇచ్చారు. మొదటి సంవత్సరం 148 మందికి ఆర్థిక సహాయం అందించగా పదిమంది సివిల్ సర్వీసెస్ కి ఎంపికయ్యారని వివరించారు. ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టడంలో బ్యూరోక్రసీ పాత్ర కీలకం, ప్రజల జీవన స్థితిగతులు మార్చడానికి సివిల్ సర్వీసెస్ ద్వారా అవకాశముంటుంది. వేలాది మంది రాష్ట్రంలో పనిచేసినా ఎస్.ఆర్ శంకరన్, పార్థసారథి, మాధవరావు వంటి కొద్ది మంది పేర్లు మాత్రమే జనం గుండెల్లో నిలిచిపోయారు అని అన్నారు. నిబద్ధతతో సేవలందిస్తే ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తీసుకువచ్చే సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి స్థాయిలో ప్రజలకు చేరవేస్తేనే ప్రభుత్వాలు ఆశించిన లక్ష్యాలు నెరవేరుతాయి అన్నారు. అధికారుల్లో చిత్తశుద్ధి లోపిస్తే ప్రభుత్వ లక్ష్యాలు ఎంత గొప్పగా ఉన్నా ఫలితం ఉండదు అన్నారు. ఎస్.ఆర్ శంకరన్ సాంఘిక సంక్షేమ శాఖలో సెక్రటరీగా ఉన్నప్పుడు చేపట్టిన కార్యక్రమాలు ప్రజల జీవన స్థితిగతులు మార్చడానికి ఉపయోగపడ్డాయి అన్నారు. 45 వేలకు పైబడి ఉన్న సింగరేణి కార్మికులు సింగరేణి సంస్థను బతికిస్తూ పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. మీ ప్రయత్నంలో, విజయం సాధించే క్రమంలో సింగరేణి కార్మికుల ఆశీస్సులు మీకు ఉంటాయని డిప్యూటీ సీఎం తెలిపారు. రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటుందని వీటిలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ వంటివి ఉన్నాయని, రాష్ట్రం నుంచి ఎక్కువ మంది సివిల్స్ కు ఎంపికైతే రాష్ట్రానికి ఎంతో మేలు కలుగుతుంది అన్నారు.రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రాజీవ్ సివిల్స్ అభయ హస్తం పథకం గొప్ప ఆశయంతో జరుపుతున్నామని, ఈ పథకం సహాయంతో సివిల్స్ లో విజయం సాధించి, పరిపాలన విభాగంలో అంకితభావంతో పనిచేయాలని కోరారు. సింగరేణి సీఎండీ ఎన్.బలరామ్ మాట్లాడుతూ పేద ఇంటి పిల్లలు కూడా సివిల్స్ లో విజయం సాధించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మార్గనిర్దేశంలో ఈ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు.సివిల్స్ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఆర్థిక ఇబ్బందుల గురించి ఆలోచించకుండా లక్ష్య సాధన పైనే పూర్తి దృష్టి సారించడం కోసం ఒక్కొక్కరికి లక్ష రూపాయల నగదు ప్రోత్సాహకం అందించడం జరుగుతుందన్నారు. ఈ ఏడాది ఎక్కువ మంది ప్రిలిమ్స్ లో ఉత్తీర్ణత సాధించి, లక్ష రూపాయల నగదు ప్రోత్సాహకం అందుకోవటం ఆనందంగా ఉందన్నారు. 30 మంది సివిల్స్ విజేతలకు మెమెంటోల బహూకరణ కాగా 2024లో తెలంగాణ ప్రాంతం నుండి సివిల్స్ విజేతలైన 30 మందికి ఈ సందర్భంగా మెమెంటోలను బహూకరించారు. వీరిలో రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకం కింద లబ్ధి పొందిన అభ్యర్థుల్లో వరంగల్ కు చెందిన ఎట్టబోయిన సాయి శివాని సివిల్స్ లో 11వ ర్యాంక్ సాధించడంపై ముఖ్య అతిథులు తమ అభినందనలు కురిపించారు. అలాగే ఫారెస్ట్ సర్వీసెస్ కి ఎంపికైన నలుగురికి, ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన ఇద్దరికి కూడా ఈ సందర్భంగా జ్ఞాపికలను అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన మాక్ ఇంటర్వ్యూల ద్వారా లబ్ధి పొందిన కర్ణాటక నుంచి ఒక్కరు, మహారాష్ట్ర నుంచి ఒకరికి జ్ఞాపికలను అందజేశారు. సమాజ సేవా కార్యక్రమాలలో సింగరేణి భేష్ ఎమ్మెల్యేల ప్రశంస రాజీవ్ గాంధీ సివిల్స్ అభయ హస్తం పథకంతో పాటు సింగరేణి సంస్థ తెలంగాణ ప్రాంతంలో అనేక సామాజిక బాధ్యత కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తుందని. విద్య, ఉపాధి అవకాశాల పెంపుదలకు కంపెనీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు గడ్డం వినోద్,గండ్ర సత్యనారాయణ, మక్కన్ సింగ్ రాజ్ ఠాకూర్, కనీస వేతనాల అమలు కమిటీ ఛైర్మన్ జనక్ ప్రసాద్ తదితరులు ప్రశంసించారు. కార్యక్రమంలో ఇంకా సింగరేణి సంస్థ డైరెక్టర్లు డి సత్యనారాయణ రావు, ఎల్వీ సూర్యనారాయణ, కే వెంకటేశ్వర్లు,గౌతమ్ పొ ట్రు, జీఎం (కో ఆర్డినేషన్) ఎస్.డి.ఎం.సుభానీ, అధికార సంఘం నాయకులు లక్ష్మీపతి గౌడ్,నరసింహ తదితరులు పాల్గొన్నారు.







# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

**మేడ్చల్ (నవభూమి బ్యూరో) మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా.:**– ప్రజావాణిలోస్వీకరించినధరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరు మిక్కిలినేని మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్ రెడ్డి లతో కలిసి కలెక్టరు 71 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం ఉండకూడదని కలెక్టరు అన్నారు. అదేవిధంగా తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.